# సినీ బేతాళ కథలు





## - డా. కె.వివేకానందమూర్తి

*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

### - 25 -

### - 'అమ్మ'ర జీవి -

**విక్రమార్కుడు బేతాళుడి శవాన్ని** మళ్లీ తన భుజం మీద వేసుకుని నడకసాగించాడు.

'హేపీ న్యూ యియర్, విక్రా!' అన్నాడు బేతాళుడు.

నీ దిక్కుమాలిన కథలు వినడానికి నాకున్న రెండు చెవులే ఎక్కువ. మళ్లీ మూడో న్యూ యియర్ ఎందుకు - అని మనస్సులోనే అనుకుని తన మౌనం భంగం కాకుండా ముందుకి కదులుతున్నాడు.

'విక్రా! నీకు శ్రమ కలుగకుండా వూడేందుకు మరో కథ చెబుతాను విను!' - అని బేతాళుడు ప్రారంభించాడు -

-"యాక్షన్ కట్టయ్య అనే దర్శకుడున్నాడు. అనేక చిత్రాలు అశేష జనానికి అందించి అందరూ మెచ్చే డైరెక్టరయ్యాడు. పౌరాణికాలు, జానపదాలూ, సాంఘిక కుటుంబ చిత్రాలు, థ్రిల్లర్స్, యాక్షన్ మూవీస్, బూతు చిత్రాలు, నీతి చిత్రాలు. యిలా కట్టయ్య తియ్యని సినిమా లేదు. ఇప్పుడు మళ్లీ మరో హిట్ సినిమాకోసం కథ వెదకడం మొదలెట్టాడు. అతని రెగ్యులర్ రైటర్ అదురు శాస్త్రిని పిలిచాడు.

'శాత్తిరీ - యీసారేటి తీద్దాం!' అన్నాడు.

శాస్త్రి బాగా థింకి థింకి. 'కట్టన్నా, దాదాపు అన్ని రకాల కథలూ వాడేశాం. మనం యిప్పటి దాకా తాకని సబ్జెక్టు వొకటే వుంది.'

'ఏటదీ?'

'ఆటో బయోగ్రఫీ'

'అదేటీ ఆటో రావుడని ఆటో వోడిమీదొటి తీసాంగా'

'ఆటో రావుడు, రిక్షా భీముడు కాదు. నా వుద్దేశం ఆత్మకథ. సర్ రిచర్డ్ ఎ టెంబరోగారు తీసిన గాంధీలా, చాప్లిన్‌లా అన్నమాట'

'మరే శాత్తిరీ - ఆ టింబరుగాడు ఆటోని బాగా లాగేడు. మరిం మనవేటి తీద్దాం!'

'తియడానికి చాలా వున్నాయి. అయితే ఆత్మతో పనిలేకుండా కళేబరంలా బతికిన వాళ్ల కథలు ప్రేక్షకుడికి నచ్చవు. '

'మరయితే నికార్సయిన ఆత్మకథ ఏమంటామ్?'

'నా వుద్దేశం జయలలిత ఆత్మకథ అయితె బెస్టు అనుకుంటున్నాను. ఆమె జీవితంలో ఎన్నో వొడుదుకుల్ని పడిలేచే కెరటంలా వోపిగ్గా తట్టుకుంటూ ఎందరి గుండెల్నో తడిపేసింది. నమ్మిన ప్రజకు మంచి చేస్తూ నమ్మక ద్రోహులకు పంచ్‌లు పంచింది. కొందరికి నచ్చడం, కొందరికి నచ్చక పోవడం, ఆర్ధ్రతలూ, ఆగ్రహాలు అందరి జీవితాల్లో వుంటాయి. నమ్మిన వాళ్ల నడుం పోట్లకు బల్లై, అందరిచేతా 'అమ్మ' అనిపించుకున్న ఆమె ఖ్యాతి కథలో బోల్డు డ్రామా వుంది. అంచేత మనం జయలలిత ఆటో బయోగ్రఫీ 'అమ్మ కథగా తీద్దాం' - అన్నాడు రచయిత అదురు శాస్త్రి.

'అదిరిందయ్యా సాత్తిరీ నీ ఆలోసన. మరయితే రంగంలో దిగి రంజుగా తీద్దాం. అయితే ఒకిస్యం. ఆత్మకథంటన్నావ్. నిజాలన్నీ నిక్కచ్చిగ వుండాల. 'అమ్మకత' బొమ్మతో ఆ టింబర్ గాడి లెవెలికి లెగాలి మనం.'

'తప్పకుండా - కట్టన్నా! అమ్మ వుదయించడం, వురూత జీవితంతో పయనించడం, అంతిమయాత్ర, ఆఖర్న పన్నీర్ సెల్వం పదవీస్వీకారం, అమ్మను కోల్పోయిన ప్రజల వేదన, అలజడిలేని నిశ్శబ్దం, అన్నీ కవర్ చేద్దాం - నేను స్క్రీన్‌ప్లే అంతా వెంటనే రాసుకొచ్చి నీకు చూపిస్తా. వియ్ విల్ మేక్ అనదర్ హిట్!' - అని అదురు శాస్త్రి కదిలాడు.

'నువ్వెప్పుడూ అదురే శాత్తరీ! అలాక్కానీ' అని యాక్షన్ కట్టయ్య లేచాడు.

"విక్రమార్కా! అంతా బాగానే వుంది కానీ, ఆత్మకథ ముగింపులో నాకు కొన్ని సందేహాలు కలుగుతుతున్నాయి. జయలలిత అంతిమ యాత్రలోగాని, ఆ తర్వాత గాని 'అమ్మ'ను కోల్పోయిన ప్రజలు మౌనంగా ఆక్రోశించారు తప్ప, యితర ప్రముఖుల నిర్యాణం తర్వాత చేసే ఆందోళనలేవీ జరగలేదు. అంటే రైళ్ళాపడం, బస్సులు, కార్లు తగలెట్టడం, బజార్లు దోచుకోవడం వగైరాలు. అంతా క్వయిట్‌గా జరిగిపోయింది. కారణం ఏవై వుంటుంది? మరో విషయం. జయలలిత 'అమ్మ'గా అందరి గుండెల్లో నిండిపోయింది. అమ్మ హాస్పిటల్, అమ్మ కాంటీన్, అమ్మ వాటర్, అమ్మ టివీ - యిలా తమిళ దేశం అంతా అమ్మగా సర్వాంతర్యామి అయింది. మరి కొత్త ముఖ్యమంత్రి పన్నీరు సెల్వం యీలోటు తీర్చగలడా? - యీ ప్రశ్నలకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పక పోయావో నీ తల వెయ్యి చెక్కలయిపోతుంది -" అని బేతాళుడు ముగించాడు.

బదులుగా విక్రమార్కుడు - "ఓ! బేతాళా! అమ్మ, జయలలిత అంతిమ యత్ర సమయంలోగాని, ఆ తర్వాతగాని తమిళ ప్రజలు తమలో తామే విలపించారు. విధ్వంసాలు, విద్రోహ చర్యలు, గందరగోళం చెయ్యలేదు. డబ్బంతా బ్లాకయిపోయి, ఆందోళన మూకలకు గొడవలు చెయ్యండ్రా అని యివ్వడానికి యింధనం కరువైంది. రోజు గడవడానికి రోజూ క్యూలలో నిలబడాల్సొచ్చాక యిక వూళ్లో అల్లర్లు చేసే తీరుబాటు కూడా కరువైంది. మోడీగారు క్యాష్‌లెస్ ట్రాన్సేక్షన్స్ పాటిస్తే అందరికీ సౌకర్యం అనగానే ముందుగా ఎటియమ్‌లు పాటించి క్యాష్‌లెస్ అయిపోయాయి. ఇక అంతటా అమ్మ పేరున్నా పన్నీర్ సెల్వంగారికి ప్రాబ్లమ్ లేదు. వారి పేరు యిప్పటికే పలువిధాలుగా విస్తరించింది - పన్నీర్ మటర్, పన్నీర్ పాలక్, పన్నీర్ మసాలా, పన్నీర్ పకోడీ - యిలా - అనుభవజ్ఞుడైన రచయిత అదుర్ శాస్త్రి యీ పాయింట్సన్నీ దృష్టిలో వుంచుకొనే అమ్మ ఆత్మకథకు స్క్రీన్‌ప్లే వండేస్తాడు. నీకా డౌటక్కర్లేదు.

- శనైశ్శనైరు పరమేత్
బుద్ధ్యా ధృతిగృహీతయా!
ఆత్మ సంస్థం మనఃకృత్వా
నకించిదపి చింత యేత్!!

వివేకముతో మెలమెల్లగా మనస్సును ఆత్మకంటె వేరైన వాటినుండి మరల్చి ఆత్మయందే నిలిపి యితరము లేవినీ తలంచరాదు - అన్నారోయ్ గీతాచార్యులు శ్రీకృష్ణభగవానుడు."

- అని ముగించగానే రాజుకి మౌనభంగం కలిగి, బేతాళుడు యెగిరి వెళ్లి మళ్లీ చెట్టెక్కేసాడు.

***(వచ్చేనెలలో మరోకథ)***

Post your comments